సాక్షి
మహబూబాబాద్
సోమవారం | 7 | జూలై | 2025



వినియోగంలోకి కొత్త పోస్టులు
టీజీ ఎన్పీడీసీఎల్‌కు కొత్తగా మంజూరైన పోస్టులను కార్పొరేట్ కార్యాలయం, సర్కిల్, డివిజన్లతో పాటు ఇతర విభాగాల వారీగా కేటాయింపులు చేశారు. - 8లో▸



దివ్యాంగులకు శుభవార్త..
దివ్యాంగులకు రైల్వే శాఖ శుభవార్త తెలిపింది. ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే రాయితీ రైల్వే పాస్‌లు జారీ చేయనుంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.1°/26.2°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వీరన్న సన్నిధిలో తొలి ఏకాదశి సందడి..



కురవి: కురవిలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్నేరు నది నుంచి నూతన జలాలను అర్చకులు, వేదపండితులు తీసుకొచ్చి ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. వీరభద్రస్వామికి మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు, వేదపండితులు రెడ్యాల శ్రీనివాస్, పెనుగొండ అనిల్, దూసకంటి విజయ్, విజయ్, తేజ, పుణ్యమూర్తి, రమేశ్, అభిలాష్, శ్రీకాంత్, బాలకృష్ణ, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్ గౌడ్, చిన్నం గణేశ్ జనార్దన్‌రెడ్డి, సక్రునాయక్, సోమ్లా, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

మహబూబాబాద్ అర్బన్: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరగనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదివారం తెలిపారు. ఈ నెల 8న మహబూబాబాద్, కేసముద్రం మండలాల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటన ఉన్నందున జిల్లా స్థాయి అధికారులు ఆపనుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి రద్దు చేసినట్లు చెప్పారు.

రిలే నిరాహార దీక్షలో చిన్నారులు..




కేసముద్రం: ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం తమకు పట్టా పాసుబుక్కులు అందించాలని ఆదివారం మండలంలోని నారాయణపురం గ్రామంలో బాధిత రైతులు తమ పిల్లలతో కలిసి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ దారావత్ రవి, పలువురు రైతులు మాట్లాడారు. సాగు చేసుకుంటున్న తమ భూములకు పట్టాదారు పాసుబుక్కులు రాకపోవడంతో ఏడు సంవత్సరాలుగా ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం పట్టాదారు పాసుబుక్కులు ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపు ఉత్తర్వులు రద్దు చేయాలి



నెహ్రూసెంటర్: రాష్ట్రంలో పని గంటల పరిమితిని 8నుంచి 10 గంటలకు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమ దోపిడీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పని గంటలను పెంచుతుందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలని అన్నారు. సమావేశంలో నాగన్న, రాజమౌళి, రాజు, వీరన్న, మల్లయ్య, శ్రీశైలం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వద్ద ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఓపెన్ టు ఆల్ చెస్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హోరాహోరీగా సాగిన పోటీల్లో గందు రిత్విక్, దారా సాయివివేష్, జె.రంజిత్, నిక్రీ ప్రహర్ష విజేతలుగా నిలిచినట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు. ముగింపు వేడుకల్లో ఆర్బిటర్లు సీహెచ్ శ్రీనివాస్, రజినీకాంత్, ఫ్రాంక్లిన్, అక్షయ్ తల్లిదండ్రులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి వేళాయె..

నేడు కేయూకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రాక

- ముఖ్య అతిథిగా ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- 387 మందికి పీహెచ్‌డీ పట్టాలు..
- 373 మందికి 564 గోల్డ్ మెడల్స్ ప్రదానం
- అడ్మిట్‌కార్డులు, ఎంట్రీపాస్‌ల పంపిణీ



కేయూ స్నాతకోత్సవానికి ముస్తాబవుతున్న ఆడిటోరియం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవాన్ని సోమవారం ఉదయం 11:30 గంటలకు క్యాంపస్‌లోని ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఒక స్టీరింగ్ కమిటీ బాధ్యులతోపాటు 10 సబ్‌కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. 2020 నుంచి 2025 వరకు పీహెచ్‌డీ పూర్తయిన వారిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న 387 మంది విద్యార్థుల పట్టాలు అందుకోనున్నారు. ఇందులో ఆర్ట్స్‌లో 56, సైన్స్ 96, ఫార్మసీ 21, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ 49, సోషల్ సైన్సెస్ 133, ఎడ్యుకేషన్ 18, లా 4, ఇంజినీరింగ్‌లో 10 మంది పీహెచ్‌డీ పట్టాలు అందుకోనున్నారు. అదేవిధంగా 2016 నుంచి 2021 వరకు వివిధ కోర్సులు పూర్తి చేసిన 373 మందికి 564 గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేయనున్నారు. ఆర్ట్స్‌లో 60, సైన్స్ 161, ఫార్మసీ 48, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ 66, సోషల్ సైన్సెస్ 88, ఎడ్యుకేషన్ 25, లా 72, ఇంజినీరింగ్‌లో 44 మందికి గోల్డ్‌మెడల్స్ ప్రదానం చేయనున్నారు.

గోల్డ్‌మెడల్స్ విద్యార్థుల జాబితాలు..

పీహెచ్‌డీ పట్టాలు పొందే విద్యార్థులకు అడ్మిట్ కార్డులు, ఎంట్రీపాస్‌లను పరీక్షల విభాగంలో అందజేశారు. పేరెంట్స్‌కు కూడా ఎంట్రీపాస్‌లు జారీ చేశారు. కేయూలోని వివిధ కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో పలు కోర్సులు చదివి గోల్డ్‌మెడల్స్ సాధించిన వారి జాబితాలను ఆయా కళాశాలలకు ఇప్పటికే పంపారు. అలాగే, ఆయా విద్యార్థులకు అడ్మిట్‌కార్డులు, ఎంట్రీపాస్‌లను కూడా పరీక్షల విభాగాధికారులు పంపించారు. గోల్డ్‌మెడల్స్ పొందే విద్యార్థులు అడ్మిట్ కార్డులు, ఎంట్రీపాస్‌లతో స్నాతకోత్సవానికి రావాల్సి ఉంటుంది.

ముందుగానే గోల్డ్‌మెడల్స్ ప్రదానం..

యూనివర్సిటీలోని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం 8 నుంచి 9:30 గంటల వరకు అభ్యర్థులకు గోల్డ్‌మెడల్స్ ముందే అందజేస్తారు. ఇందుకు అధ్యాపకులతో కూడిన కమిటీ కూడా ఉంది. విద్యార్థులు గోల్డ్‌మెడల్స్ తీసుకుని ఆడిటోరియంలో కేటాయించిన సీట్లలో కూర్చోవాల్సి ఉంటుంది. పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాల ప్రదానం అనంతరం గోల్డ్‌మెడల్స్ విద్యార్థులు వేదిక మీదకు వచ్చి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో ఫొటోలు దిగాల్సి ఉంటుంది. 373 మందిని 19 బ్యాచ్‌లుగా చేశారు. అయితే అందులో ఎంతమంది హాజరవుతారనేది ఉదయమే తెలియనుంది. ఎందుకంటే వారిలో కొందరు ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తున్నారు. కొందరు విదేశాల్లో ఉండొచ్చని భావిస్తున్నారు.

పేరెంట్స్ కోసం బయట స్క్రీన్ ఏర్పాటు..

పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ పొందే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆడిటోరియంలోకి అనుమతిలేదు. వీరి కోసం ఆడిటోరియం బయట భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవాన్ని వీరు వీక్షించనున్నారు.

కేయూలో భారీ బందోబస్తు..

కాకతీయ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించనున్న స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రానుండడంతో క్యాంపస్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం స్నాతకోత్సవాన్ని నిర్వహించే ఆడిటోరియం ప్రాంతంలో బాంబు స్క్వాడ్ తనిఖీ చేసింది. సోమవారం ఉదయం మరోసారి తనిఖీ చేయనున్నది. కేయూలో పోలీసులు మోహరించారు. కేయూ పోలీస్ స్టేషన్‌తోపాటు వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన ఐదుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 150 మందికి పైగా పోలీస్ సిబ్బంది అందులో క్విక్ రెస్పాన్స్ పోలీస్ ఫోర్స్ కూడా బందోబస్తు నిర్వహిస్తారు. ఎంట్రీపాస్‌లు ఉన్న విద్యార్థులకు వివిధ కమిటీల బాధ్యులకు సభ్యులకు (ఆచార్యులు, ఉద్యోగులు) పాలక మండలి సభ్యులు, సెనెట్ సభ్యులకు ప్రెస్‌కు ఆడిటోరియంలోకి అనుమతి ఉంటుంది. పలు విద్యార్థి సంఘాల బాధ్యులపై పోలీసులు నిఘా ఉంచారు.

గవర్నర్, ఐఐసీటీ డైరెక్టర్ రాక



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి

కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రానున్నారు. అలాగే, ముఖ్య అతిథిగా శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, హైదరాబాద్‌లోని ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి హాజరుకానున్నారు. స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పీహెచ్‌డీ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తారు. పీహెచ్‌డీ పట్టాలు, గోల్డ్‌మెడల్స్ పొందేవారు వైట్ డ్రెస్‌లోనే రావాల్సి ఉంటుంది. కేటాయించిన సీట్లలో వారు కూర్చోవాల్సి ఉంటుంది.

షెడ్యూల్ ఇలా..

- గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హైదరాబాద్ నుంచి ఉదయం 8:30 గంటలకు బయల్దేరి ఉదయం 11 గంటలకు వరంగల్ నిట్‌కు చేరుకుంటారు.
- ఉదయం 11:15 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి కాకతీయ యూనివర్సిటీకి ఉదయం 11:25 గంటలకు చేరుకుంటారు.
- ఆడిటోరియం వద్ద ఉదయం 11:30 గంటలకు అకడమిక్ సెనెట్ సమావేశం ఉంటుంది. 11:35 గంటలకు సెనెట్ సభ్యులు గవర్నర్‌తో ఫొటో దిగుతారు. అనంతరం ప్రొసెషన్ ఉంటుంది.
- ఉదయం 11:40 గంటలకు కాన్వొకేషన్ ప్రొసీడింగ్స్ ఉంటాయి. 11:50 గంటలకు కేయూ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి రిపోర్ట్ ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటలకు ముఖ్య అతిథి శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, హైదరాబాద్ ఐఐసీటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగిస్తారు. 12:10 గంటలకు చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగిస్తారు. 12:20 గంటల నుంచి పీహెచ్‌డీ అభ్యర్థులకు పట్టాల ప్రదానం ఉంటుంది. అనంతరం గోల్డ్‌మెడల్స్ విద్యార్థులు గ్రూప్ ఫొటో దిగాల్సి ఉంటుంది.
- మధ్యాహ్నం 1:15 గంటలకు స్నాతకోత్సవం ముగుస్తుంది.

ఘనంగా బీరన్న బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం గొల్ల, కురుమ కులస్తులు బీరన్నస్వామికి బోనాలు సమర్పించారు. మహిళలు ఇళ్ల నుంచి బోనాలతో పుర వీధుల గుండా బయలుదేరివెళ్లారు. అనంతరం బీరన్న ఆలయంలో ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మరమ్మతులేవి?

- ఏడాది క్రితం వరదల్లో ధ్వంసమైన శ్మశానవాటిక, వర్మి కంపోస్ట్ షెడ్
- పట్టించుకోని అధికారులు



ధ్వంసమైన వర్మి కంపోస్ట్ షెడ్, శ్మశానవాటిక

డోర్నకల్: మండలంలోని మున్నేరువాగు సమీపంలో చాప్లాతండా గ్రామపంచాయతీకి చెందిన శ్మశానవాటిక, వర్మి కంపోస్ట్ షెడ్ ఏడాది క్రితం వరదలతో ధ్వంసమయ్యాయి. కాగా, నాలుగేళ్ల క్రితం వాటిని నిర్మించారు. పనుల అనంతరం అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ప్రారంభించారు. అయితే గత వానాకాలం జూలై 27న భారీ వర్షాలతో మున్నేరుకు వరదలు రావడంతో వర్మి కంపోస్ట్ షెడ్‌తో పాటు శ్మశానవాటిన ధ్వంసమయ్యాయి. ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరదధాటికి ధ్వంసం..

వర్మి కంపోస్ట్ షెడ్ కంపార్ట్‌మెంట్లతో పాటు శ్మశానవాటిక బర్నింగ్ ప్లాట్‌ఫారాలు, టాయిలెట్లు వరద ధాటికి ధ్వంసమయ్యాయి. వర్మి కంపోస్ట్ షెడ్ ధ్వంసమవడంతో చాప్లాతండా గ్రామం నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. శ్మశానవాటిక దెబ్బతినడంతో చనిపోయిన వారి అంత్యక్రియలు మున్నేరువాగు ఒడ్డున నిర్వహిస్తున్నారు. కాగా మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా నేటికీ నిధులు మంజూరు కాలేదు.

సపోర్టు కట్టను పట్టించుకోవడం లేదు..

వరదతో మున్నేరు ఆనకట్ట సపోర్టు కట్ట కొట్టుకుపోగా నేటికీ మరమ్మతులు చేపట్టలేదు. నాడు వరదల్లో సపోర్టు కట్ట కొట్టుకుపోవడంతో దిగువ ప్రాంతాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. కొన్ని రోజుల క్రితం డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ సపోర్టు కట్టను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. మరోవైపు వర్షాకాలం ప్రారంభమై వర్షాలు పడుతుండటంతో మున్నేరువాగుకు వరద వచ్చే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే స్పందించి వాగు సపోర్టు కట్ట మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వసూళ్ల పర్వం!

- కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు రూ.3 వేల వరకు వసూలు



గార్ల తహసీల్దార్ కార్యాలయం

గార్ల: కొత్త రేషన్‌కార్డుల మంజూరు కోసం తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రేషన్ కార్డుల కోసం వెళ్తే కార్యాలయ సిబ్బంది సర్వర్ బిజీగా ఉందని, సైట్ ఓపెన్ కావడం లేదని, తర్వాత రమ్మని తిప్పుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పని కావడం లేదని వాపోతున్నారు. రెవెన్యూ సిబ్బందికి డబ్బులు ముట్టచెబితే మాత్రం కొత్త రేషన్‌కార్డులు వెంటనే మంజూరు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్యాలయం చుట్టూ తిరగలేక డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని లబ్ధిదారులు అంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శారదను సాక్షి వివరణ కోరగా మా కార్యాలయంలో రేషన్‌కార్డుల మంజూరు కోసం ఎవరి వద్దనుంచి డబ్బులు వసూలు చేయడం లేదు. ఒకవేళ సిబ్బంది డబ్బులు తీసుకున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్



గూడూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న అధ్యక్షతన మండల, గ్రామ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 8న కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.300 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మరో ఆరుగురు మంత్రులు హాజరవుతారన్నారు. ఆ సందర్భంగా అక్కడ నిర్వహించే బహిరంగ సభకు గూడూరు మండలం నుంచి సుమారు 5నుంచి 6వేల మంది కార్యకర్తలను తరలించి, సభను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, జిల్లా నాయకులు మాధవపెద్ది రమేశ్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, ఎండి. యాకూపాషా, మండల మల్లేశ్, పెసరి శివ, కన్నబోయిన వెంకన్న, హెచ్ శివ,అగ్రెం వీరస్వామి, చంటి స్వామి పాల్గొన్నారు. అదేవిధంగా పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, మాజీ ఎంపీపీ నూనావత్ రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి కేసముద్రంలో జరిగే కాంగ్రెస్ సభ విజయవంతానికి కృషి చేయాలి మండల నాయకులకు పిలుపునిచ్చారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని సోమ్లాతండాలో ఈ నెల 8న జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. సోమ్లాతండాలో బహిరంగ సభ, హెలిపాడ్ స్థలాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా రావచ్చని, అప్రమత్తంగా ఉండాలని, మానుకోట నియోజకవర్గంలో 90 శాతానికిపైగా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందే విధంగా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మున్నేరు నీటిని తరలించొద్దు

- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

బయ్యారం: మున్నేరువాగు నీటిని ఈ ప్రాంత రైతుల అవసరాలకు ఇవ్వకుండా, పాలేరు ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బయ్యారంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో మున్నేరు నీటి తరలింపుపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణం ఈ ప్రాంత ప్రజల ఐదున్నర దశాబ్దాల కల అని, గార్ల, బయ్యారం, డోర్నకల్, కురవి, కామేపల్లి మండలాల సాగునీటి అవసరాల కోసం డిజైన్ చేసిన ప్రాజెక్ట్‌ను ప్రస్తుత పాలకులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్ర సీఎంగా వైఎస్.రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలో మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు విడుదల చేశారన్నారు. వైఎస్సార్ మరణానంతరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇక్కడ ఒక్క ఎకరానికి నీళ్లివ్వకుండా పాలేరుకు నీటిని తరలించుకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. మున్నేరు నీటి రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర నాయకుడు గోపగాని శంకర్‌రావు, ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, టీవీవీ రాష్ట్ర నాయకుడు విశ్వ, సీపీఎం జిల్లా నాయకుడు మండ రాజన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాత గణేశ్, బి.సూర్యనారాయణ, బాబూరావు, భీముడు, నందగిరి వెంకటేశ్వర్లు, జి.సక్రు, ఏనుగుల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మిషన్.. నిరుపయోగం!

- వృథాగా స్వీపింగ్ మిషన్, ఆటోలు
- ప్రజాధనం దుర్వినియోగం
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం



మూలనపడ్డ రోడ్డు స్వీపింగ్ మిషన్



నిరుపయోగంగా మారిన ఆటోలు



తుప్పుపడుతున్న కాల్వలను శుభ్రం చేసే మిషన్

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో పలు వాహనాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు ఏమాత్రం ఆలోంచించకుండా సుమారు రూ.55లక్షలతో రోడ్డు స్వీపింగ్ మిషన్, రూ.20 లక్షలతో కాల్వలు శుభ్రం చేసే మిషన్ కొనుగోలు చేశారు. స్వీపింగ్ మిషన్ మానుకోట రోడ్లపై పని చేయడం లేదు. కాల్వలు శుభ్రం చేసే మిషన్ పరిస్థితి కూడా అంతే. దాదాపు రెండున్నర సంవత్సరాలుగా మూలనపడి ఉంటున్నాయి. వాటితో పాటు నాలుగు ఆటోలు కూడా మూలనపడి తుప్పు పడుతున్నాయి. దీంతో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష జనాభా..

మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా.. 68,889 మంది జనాభా, 57,828 మంది ఓటర్లు, 25,000 పైచిలుకు గృహాలు ఉన్నాయి. విద్య, వ్యాపారం, ఉద్యోగ రీత్యా మానుకోటలో నివాసం ఉండే వారితో కలిపి జనాభా లక్ష దాటుతుంది. అవుట్ సోర్సింగ్‌లో 205 మంది పని చేస్తుండగా.. వారిలో 143 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. ట్రాక్టర్లు 11, మూడు చక్రాల ఆటోలు 14, నాలుగు చక్రాల ఆటోలు 19 ఉండగా ప్రతీ రోజు 33 టన్నుల చెత్త సేకరణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సిగ్నల్ కాలనీ శివారులో ఒక చెత్త డంపింగ్ యార్డు, గాంధీపురం గ్రామశివారులో మరో డంపింగ్ యార్డు ఉన్నాయి. కాగా జనాభాకు తగిన విధంగా పారిశుద్ధ్య కార్మికులు లేరు. కాగా పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టారు.

రూ.55లక్షలతో రోడ్డు స్వీపింగ్ మిషన్..

సుమారు రెండున్నర సంవత్సరాల క్రితం 14వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.55 లక్షల వ్యయంతో రోడ్డు స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేశారు. అలాగే రూ.20 లక్షలతో కాల్వలు శుభ్రం చేసే జేసీబీ లాంటి మిషన్ కొనుగోలు చేశారు. కానీ మానుకోట రోడ్లపై స్వీపింగ్ మిషన్ పనిచేయడం లేదు. రోడ్డు మీద నడపగానే మిషన్ బుష్‌లు, ఇతర పరికరాలు ఊడిపోయాయి. దీంతో నాటి నుంచి నేటి వరకు మిషన్ మూలన పడింది. అలాగే కాల్వలు శుభ్రం చేసే మిషన్ కూడా మానుకోట కాల్వల్లో పని చేయడం లేదు. అలాగే రెండు సంవత్సరాల క్రితం ఐసీఐసీఐ బ్యాంక్ అధికారులు మానుకోట మున్సిపాలిటీకి నాలుగు మూడు చక్రాల ఆటోలు బహూకరించారు. ఆబ్యాంక్‌లో మానుకోట మున్సిపాలిటీ ఖాతా ఉండడం.. లావాదేవీలు జరపడం వల్ల ఆటోలు బహూకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ ఆటోలు కూడా పనిచేయడం లేదు.

సుమారు కోటి రూపాయలు వృథా..

రోడ్డు స్వీపింగ్ మిషన్, కాల్వల శుభ్రం చేసే మిషన్, నాలుగు ట్రాలీ ఆటోలను కలిపితే సుమారు కోటి రూపాయలు వృథా అయ్యాయి. మానుకోట మున్సిపాలిటీ పరంగా రూ.70 లక్షలు, బ్యాంక్ ద్వారా ఆటోలకు రూ.25 లక్షలు, ఇతర వస్తువులు కొనుగుల కలిపి సుమారు కోటి రూపాయలు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. సుమారు రెండున్నర సంవత్సరాలుగా మూలకు పడడంతో.. ప్రస్తుతం వాటి టైర్లు, పరికరాలు పాడైపోతున్నాయి.

డ్రైవర్లు లేకనే..

ఇంజనీరింగ్ విభాగం అధికారులు మాత్రం శిక్షణ పొందిన డ్రైవర్లు లేకనే మిషన్లు మూలకుపడ్డాయని చెబుతున్నారు. అయితే కొనుగోలు చేసేటప్పుడు మానుకోట మున్సిపాలిటీ డ్రైవర్లకు అవగాహన ఉందో లేదో తెలుసుకోవాలి. కానీ ఎవరిని సంప్రదించకుండానే తొందరపడి కొనుగోలు చేసి అభాసుపాలయ్యారు. కాగా ఉపయోగపడే విధంగా మార్పులు చేసి వెంటనే వినియోగంలోకి తేవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

15 రోజుల్లో వినియోగంలోకి వస్తాయి..

మిషన్లకు రిపేర్లు ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేసి 15రోజుల్లో వినియోగంలోకి తెస్తాం. డ్రైవర్లకు కూడా వాటిని నడిపే విషయంలో శిక్షణ ఇప్పించి ఉపయోగిస్తాం. అవి వినియోగంలోకి వస్తే పారిశుద్ధ్యపరంగా చాలా వరకు సమస్యలు తగ్గుతాయి.

-సీహెచ్.ఉపేందర్, మానుకోట మున్సిపల్ డీఈ

ఘనా, నీలపతాక క్రమాల్లో అమ్మవారికి పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ నవరాత్రోత్సవాల్లో భాగంగా పదకొండో రోజు ఆదివారం అమ్మవారికి ఘనా, నీలపతాక క్రమాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం నిర్వహించారు. అనంతరం కాళీక్రమాన్ని అనుసరించి స్నపనభేరాన్ని ఘనా అమ్మవారిగా, షోడశీక్రమాన్ని అనుసరించి భోగభేరాన్ని నీలపతాక అమ్మవారిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ. శేషుభారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలి ఏకాదశి, ఆదివారం సెలవురోజు కావడంతో అధిక సంఖ్యలో దేవాలయాన్ని సందర్శించారు.



ఘనా అమ్మవారిగా అలంకరణ



దేవాలయంలో భక్తుల రద్దీ

క్లుప్తంగా

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్నేహశబరీశ్, ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో (అటానమస్) కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 22, 23 తేదీల్లో 'రీసెంట్ ట్రెండ్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ కెమికల్ అండ్ అలైడ్ సైన్సెస్ రీసెర్చ్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించబోతున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ స్నేహ శబరీశ్ ఆవిష్కరించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగం అధిపతి అరుణ, అధ్యాపకులు ఉదయశ్రీ, బాలరాజు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

హసన్‌పర్తి: కడుపు నొప్పి బాధ భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హసన్‌పర్తి మండలం కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన బండి సదానందం(44) ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం పొందినా నయం కాలేదు.దీంతో జీవితంపై విరక్తి చెందిన సదానందం శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబసభ్యులు వివిధ ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. అయితే ఆదివారం ఉదయం హసన్‌పర్తిలోని ఓ వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శేఖర్ (ఫైల్)

భూపాలపల్లి అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాంబమూర్తి కథనం ప్రకారం.. మహాముత్తారం మండలం స్థంభంపల్లి(పీపీ) గ్రామానికి చెందిన గుండు శేఖర్(34) పని నిమిత్తం బైక్‌పై భూపాలపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని సంతోషిమాత ఆలయం ఎదుట జాతీయ రహదారిపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బారికేడ్‌ను అదుపు తప్పి ఢీకొన్నాడు. దీంతో రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తున్నట్లు క్రమంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, మూడేళ్ల కూతురు ఉన్నారు.



వినియోగంలోకి కొత్త పోస్టులు..

టీజీ ఎన్పీడీసీఎల్‌కు 339 ఉద్యోగాలు
- ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- కంపెనీ అవసరాల మేరకు కేటాయింపు..



టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌కు కొత్తగా మంజూరైన పోస్టులను వినియోగంలోకి తీసుకొస్తూ కార్పొరేట్ కార్యాలయం, సర్కిల్, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్ల వారీగా కేటాయింపులు చేశారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఏళ్లుగా వినియోగంలో లేని 216 అన్ యూజ్డ్ పోస్టులు, ఖాళీగా ఉంటున్న 217 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను ప్రభుత్వం రద్దు చేస్తూ నూతనంగా 339 ఉద్యోగాలు మంజూరు చేసింది. ఈ పోస్టులను కార్పొరేట్ కార్యాలయం, సర్కిల్, డివిజన్లు, ఇతర విభాగాల వారీగా పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

సర్కిళ్ల వారీగా విభజన..

కొత్తగా మంజూరైన చీఫ్ ఇంజనీర్ పోస్టును కార్పొరేట్ కార్యాలయం సీఈ ప్లానింగ్, ఐటీ, స్క్వాడ్‌గా నిర్ణయించారు. చీఫ్ జనరల్ మేనేజర్ పోస్టును కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎం ఆడిట్‌గా, జాయింట్ సెక్రటరీ పోస్టును లీగల్, రిక్రూట్‌మెంట్ జాయింట్ సెక్రటరీగా, ఇప్పటికే ఉన్న జాయింట్ సెక్రటరీ పోస్టును మెడికల్, పెన్షన్ జాయింట్ సెక్రటరీగా రీ డిజైన్ చేశారు. కొత్తగా మంజూరైన నాలుగు ఎస్ఈ పోస్టుల్లో ఒకటి కార్పొరేట్ కార్యాలయానికి కేటాయించారు. అయితే కార్పొరేట్ కార్యాలయంలో డీపీఈ పోస్టు ఒకటే ఉండగా మరోటి రావడంతో వీటిని సర్కిళ్ల వారీగా విభజించారు. డీపీఈ–1 కింద హనుమకొండ, వరంగల్, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం సర్కిళ్లు, డీపీఈ–2 కింద కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ సర్కిల్ ఉండేలా పునర్విభజించారు. ఒక ఎస్ఈ పోస్టును ములుగు సర్కిల్‌కు, మరో రెండు ఎస్ఈ పోస్టుల్లో ఒకటి కార్పొరేట్ కార్యాలయం కమర్షియల్ ఎస్ఈగా, మరోటి ఎంక్వైరీస్ ఎస్ఈగా కేటాయించారు. జనరల్ మేనేజర్ ఒకటి మంజూరు కాగా దీనిని కార్పొరేట్ కార్యాలయం రిక్రూట్‌మెంట్‌గా, ఇప్పటికే ఉన్న జీఎం పోస్టును మెడికల్, పెన్షన్ విభాగం జీఎంగా రీడిజైన్ చేశారు. మంజూరైన నాలుగు డివిజనల్ ఇంజనీర్ పోస్టులలో కాటారం డివిజన్, ములుగు సర్కిల్ డీఈ టెక్నికల్, మధిర డివిజన్, కార్పొరేట్ కార్యాలయానికి ఒక డీఈ పోస్టుగా పంపిణీ చేశారు. నాలుగు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులను భూపాలపల్లి, ఆదిలాబాద్, ములుగు, ఆసిఫాబాద్‌కు కేటాయించారు. ఆరు ఏడీఈ పోస్టులను ములుగు ఎస్ఈ కార్యాలయం, మహదేవపూర్ సబ్ డివిజన్, తాడ్వాయి సబ్ డివిజన్‌కు ఒక్కొక్కటి, మరో మూడు పోస్టులు కార్పొరేట్ కార్యాలయానికి అలాట్ చేశారు. అకౌంట్స్ ఆఫీసర్ పోస్టును ములుగు సర్కిల్‌కు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు రెండు మంజూరు కాగా ఒకటి ములుగు సర్కిల్‌కు, మరోటి అశ్వరావుపేట ఈఆర్‌ఓకు కేటాయించారు. పర్సనల్ ఆఫీసర్ పోస్టులు నాలుగు మంజూరు కాగా వరంగల్, భూపాలపల్లి, పెద్దపల్లి, ఆసిఫాబాద్ సర్కిల్‌కు అలాట్ చేశారు. అలాగే, అసిస్టెంట్ ఇంజనీర్, సబ్ ఇంజనీర్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్స్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్స్, అసిస్టెంట్ లైన్‌మెన్, ఆఫీస్ సబార్డినేట్, వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులను సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్ల వారీగా అలాట్ చేశారు. కొత్త పోస్టులతో టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ములుగు సర్కిల్‌తో పాటు, ములుగు సర్కిల్ పరిధిలో కాటారం, ఖమ్మం జిల్లాలో మధిర నూతన డివిజన్‌గా, ములుగు జిల్లాలో మహదేవ్‌పూర్, తాడ్వాయి సబ్ డివిజన్లు కొత్తగా ఏర్పాటు కానున్నాయి.

దివ్యాంగులకు శుభవార్త..

- ఆన్‌లైన్‌లో రైల్వే పాస్‌ల జారీ..
- బుకింగ్ కౌంటర్ల వద్ద నిరీక్షణకు తెర



దివ్యాంగ్‌జన్ కార్డు

కాజీపేట: దివ్యాంగులకు శుభవార్త. రైల్వే శాఖ ఇటీవల (రెండు,మూడు నెలలు) నుంచి పాస్ పొందే ప్రక్రియను సులభతరం చేసింది. ఆన్‌లైన్‌లోనే అందజేస్తోంది. దివ్యాంగులు గతంలో రైల్వే శాఖ అందించే రాయితీ పాస్‌ల కోసం స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. అన్ని ధ్రువపత్రాలు, ఫొటోలు ఇచ్చినా ప్రక్రియ పూర్తయ్యే వరకు పలుమార్లు తిరగాల్సి వచ్చేది. ఈ ప్రక్రియలో తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందులు పడలేక కొందరు అసలు పాస్‌లు తీసుకోవడానికే ముందుకు రావడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 12,500 మందికి పైగా దివ్యాంగులున్నారు. వారిలో సగం మందికి పైగా రైల్వే పాస్‌లు లేవు. వరంగల్, కాజీపేట, కాజీపేట టౌన్, మహబూబాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ తదితర ప్రధాన రైల్వే స్టేషన్ల చుట్టూ తిరగాల్సి రావడమే అందుకు కారణం. ఈ అంశాలను గమనించిన రైల్వే శాఖ దివ్యాంగ పాస్ ప్రక్రియను సులభతరం చేసింది. రెండు, మూడు నెలల నుంచి ఆన్‌లైన్‌లో దివ్యాంగజన్ కార్డులు జారీ చేస్తోంది. ఆన్‌లైన్ ద్వారా పాస్‌లు పొందడంతో పాటు ఇప్పటికే ఉన్న వారు నవీకరించుకునే వెసులుబాటు కల్పించింది.

నాలుగు దశల్లో పరిశీలన..

ఆన్‌లైన్ వివరాలు నమోదు చేశాక.. నాలుగు దశల్లో పరిశీలన జరుగుతుంది. అంతా సవ్యంగా ఉంటే.. నెల, నెన్నర రోజుల్లో కార్డు జారీ చేస్తారు. అది సమీప రైల్వే స్టేషన్‌కు వస్తుంది. దరఖాస్తులో పేర్కొన్న ఫోన్ నంబర్‌కు సమాచారం రాగానే వెళ్లి కార్డు తీసుకోవచ్చు. ఈ కార్డుతో కేవలం రాయితీ పొందడమే కాకుండా ఐఆర్‌సీటీసీ ద్వారా టికెట్లు పొందొచ్చు.

దరఖాస్తు విధానం ఇదీ...

- divyangianid. indianrail. gov. in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ప్రాధాన్య భాషను ఎంపిక చేసుకోవాలి. ఆ భాషలోనే పేజీ ఓపెన్ అవుతుంది. దానిని క్లిక్ చేస్తే దరఖాస్తు వివరాలు వస్తాయి. ఆ ప్రకారం ఫోన్ నంబర్లు, ఈ–మెయిల్ ఐడీ, పూర్తి చిరునామా తదితర వివరాలు నమోదు చేయాలి. ఫొటోలు అవసరమైనా ధ్రువపత్రాలను పీడీఎఫ్ రూపంలో పొందుపరచాలి.
- తమ ఆధార్ కార్డు, సదరం ధ్రువపత్రం (అందులో వైద్యుడి వివరాలు, రిజిస్ట్రేషన్, వైకల్య స్వభావం స్పష్టంగా ఉండాలి.) ఉండాలి
- జనన ధ్రువపత్రం (ఆధార్, పాన్‌కార్డు ఉండాలి, పదోతరగతి ధ్రువపత్రం ఉన్నా పర్వాలేదు) ఫొటోలను పీడీఎఫ్ ఫార్మట్‌లో పొందుపర్చాలి.

ఆర్టీసీ కండక్టర్‌తో ప్రయాణికుడి గొడవ

- చేతిలో ఉన్న ఎస్ఆర్, డబ్బులతో పరుగు
- పట్టుకుని పోలీసులకు అప్పగింత



డబ్బులు సరిచూసుకుంటున్న కండక్టర్

జనగామ: ఆర్టీసీ బస్సులో కండక్టర్‌తో గొడవపడి టికెట్ వివరాలను నమోదు చేసే ఎస్ఆర్, డబ్బులను ఓ ప్రయాణికుడు ఎత్తుకెళ్లిన ఘటన ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలో జరిగింది. కండక్టర్ శంకర్ కథనం ప్రకారం.. జనగామ డిపోకు చెందిన టీఎస్27టీ7232 నంబర్ గల అద్దె బస్సు సిద్దిపేట నుంచి బయలుదేరింది. జిల్లా కేంద్రంలోని కోర్టు వద్ద ఓ ప్రయాణికుడు బస్సు ఎక్కాడు. టిమ్ సర్వీస్ క్లోజ్ చేశానని కండక్టర్ తెలిపారు. అయితే సదరు ప్రయాణికుడు గొడవ చేయడంతో టిమ్‌ను రీ ఓపెన్ చేసి టికెట్ ఇచ్చాడు. అయినా సదరు ప్రయాణికుడు బూతు పురాణం మొదలు పెట్టాడు. తోటి ప్రయాణికులు సైతం అతడిని వారించినా వినలేదు. కృష్ణ కళామందిర్ జంక్షన్‌లోని గాంధీ విగ్రహం వద్దకు రాగానే బస్సు స్లో కావడంతో కండక్టర్ చేతిలో ఉన్న ఎస్ఆర్, డబ్బులు లాక్కుని పరారయ్యాడు. దీంతో కండక్టర్, ప్రయాణికులు కేకలు పెట్టారు. అక్కడే ఉన్న స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. పోలీసులకు అప్పగించి, డిపో మేనేజర్‌కు సమాచారం అందించారు. ప్రయాణికుడి పూర్తి వివరాలు తెలియలేదు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

- సీజీఆర్ఎఫ్ చైర్మన్ వేణుగోపాల చారి

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ ఎస్.వి.వేణుగోపాల చారి తెలిపారు. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, భూపాలపల్లి, జనగామ సర్కిళ్లలో ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో వివరించారు. 9న భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధి, కొత్తగూడెం డివిజన్, లక్ష్మీదేవిపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బొమ్మనపల్లి సబ్ స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టులో లక్ష్మీదేవిపల్లి, బొమ్మనపల్లి, టేకులపల్లి సెక్షన్ల పరిధిలోని వినియోగదారులు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. 10న భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్, భద్రాచలం డివిజన్, చర్ల సబ్ డివిజన్ పరిధిలోని దుమ్ముగూడెం సబ్ స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టులో దుమ్ముగూడెం, చర్ల ప్రాంతాల వినియోగదారులు, 14న కరీంనగర్ సర్కిల్, హుజూరాబాద్ డివిజన్, జమ్మికుంట సబ్ డివిజన్ పరిధిలోని చల్లూరు సబ్ స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టులో చల్లూరు, జమ్మికుంట టౌన్, రూరల్, ఇల్లంతకుంట, తనుగుల, వీణవంక ప్రాంతాల వినియోగదారులు హాజరై సమస్యలు వివరించాలన్నారు. 15న భూపాలపల్లి సర్కిల్, భూపాలపల్లి డివిజన్, కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పలిమెల సబ్ స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టులో పలిమెల, కాటారం, కొయ్యూరు, మహదేవపూర్, మహాముత్తారం ప్రాంతాల వినియోగదారులు, 17న జనగామ సర్కిల్, జనగామ డివిజన్, జనగామ సబ్ డివిజన్‌లోని బచ్చన్నపేట సబ్ స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టులో బచ్చన్నపేట, జనగామ టౌన్ 1, జనగామ టౌన్ 2, జనగామ రూరల్, పడమటి కేశవపూర్, పెంబర్తి సెక్షన్ ప్రాంతాల వినియోగదారులు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. 19న కరీంనగర్ సర్కిల్, కరీంనగర్ రూరల్ డివిజన్, గంగాధర సబ్ డివిజన్‌లోని గుండి సబ్ స్టేషన్‌లో జరిగే లోకల్ కోర్టులో గుండి, అచంపల్లి, ఆర్నకొండ, చొప్పదండి ప్రాంతాల వినియోగదారులు హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ వేణుగోపాల చారి కోరారు.

ఇద్దరు పిల్లలను సాకేదెట్లా..?

ఇంటి పెద్దను కోల్పోయిన నిరుపేద కుటుంబం
- దిక్కు లేనివారైన భార్య, ఇద్దరు పిల్లలు
- రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ..
- మంజూరైన ఇందిరమ్మ ఇంటిని కూడా నిర్మించుకోని దుస్థితి..
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు



వీరన్న (ఫైల్)



సాయంకోసం దీనంగా ఎదురు చూస్తున్న తల్లి భ్రమనంబ, పిల్లలు

దీన గాథ

మరిపెడ రూరల్: పేద కుటుంబంపై విధి పగబట్టింది. రెక్కల కష్టంపై ఆధారపడిన కుటుంబ పెద్దను అనారోగ్యం రూపంలో కబలించింది. ఫలితంగా భార్య, ఇద్దరు పిల్లలు దిక్కులేని వారిగా మారి రోడ్డున పడ్డారు. కనీసం తిండి గింజలు కూడా లేని దుస్థితి. భర్త అంత్యక్రియలు, దశదిన కర్మలకు గ్రామస్తులే సహకరించారు. అయితే ఇప్పుడు ఆ ఇద్దరు పిల్లలను సాకేదెట్లా అంటూ తల్లి భ్రమనంబ గుండెలవిసేలా రోదిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామానికి చెందిన చిదుముల వీరన్న, భ్రమనంబ దంపతులు నిరుపేదలు. కూలీ పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు రక్షిత్, బ్లెస్సి సంతానం(పది సంవత్సరాల లోపు). ఈ క్రమంలో వీరన్నకు నెల క్రితం విష జ్వరం సోకింది. దీంతో చికిత్స నిమిత్తం పలు ఆస్పత్రులు ఆశ్రయించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రెక్కల కష్టం ద్వారా దాచుకున్న రూ. 50 వేలతోపాటు కొంత అప్పు చేసి భర్త చికిత్సకు ఖర్చు చేసింది. అయినా విష జ్వరం కారణంగా వీరన్నకు కామెర్లు సోకి గత నెల 23వ తేదీన మృతి చెందాడు. వీరన్న అంత్యక్రియలకు కూడా ఇంట్లో చిల్లి గవ్వలేదు. దీంతో ఆ కుటుంబ దీన స్థితి చూసి చలించిన గ్రామస్తులు ముందుకొచ్చి దాహన సంస్కారాలతోపాటు దశదిన కర్మలకు సహకారం అందించారు. నిరుపేద కుటుంబ కావడంతో వీరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. అయితే పూట గడవని పరిస్థితుల్లో ఆ ఇంటిని నిర్మించుకోలేని దుస్థితిలో ఉంది ఆ కుటుంబం. గ్రామస్తుల సాయంతో (ఆర్థిక, నిత్యావసరాలు) భ్రమనంబ ప్రస్తుతం కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. తన ఇద్దరు పిల్లలను సాకేదెలా అని కన్నీటి పర్యాంతమవుతోంది. దీనిపై దాతలు స్పందించి ఆపన్న హస్తం అందించి ఆదుకోవాలని భ్రమనంబతోపాటు గ్రామస్తులు వేడుకుంటున్నారు.

నిరుపేద కుటుంబానికి ఆపన్నహస్తం అందించే దాతలు 88973-90368 నంబర్‌ను సంప్రదించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నకిలీ వైద్య కేంద్రాలపై టీజీఎంసీ తనిఖీలు

- పలు వైద్య కేంద్రాలపై కేసులు



తనిఖీలు చేస్తున్న అధికారులు

ఎంజీఎం : నగరంలోని గోపాల్‌పూర్, యాదవనగర్ ప్రాంతాల్లో నకిలీ వైద్యులు నడుపుతున్న కేంద్రాలపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) తనిఖీలు నిర్వహించినట్లు టీజీఎంసీ సభ్యుడు వి.నరేశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా స్టెరాయిడ్లు, యాంటి బయాటిక్స్, పెయిన్ కిల్లర్ వంటి ఔషధాలను వాడుతున్న నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గోపాల్‌పూర్‌లోని సాదుల్లా మెడికల్ స్టోర్ పని చేస్తున్న ఎండీ అక్బల్ షరీఫ్ మెడికల్ షాప్ వెనుకభాగంలో పడకలతో ఆస్పత్రిలా నడుపుతూ ఐవీ ఫ్లూయిడ్స్, నొప్పి నివారణ ఇంజెక్షన్లు అనధికారంగా ఇస్తున్నారన్నారు. అలాగే, గోపాల్‌పూర్‌లోని అంజలి రెడ్డి క్లినిక్‌లో సి.హెచ్. వెంకట్ రెడ్డి ఎలాంటి విద్యార్హత లేకున్నా 20 సంవత్సరాల నుంచి క్లినిక్ నడుపుతున్నాడు. అలాగే, డిప్లొమా ఇన్ ఓటీ టెక్నీషియన్ చేసిన క్రాంతి కుమార్ యాదవనగర్‌లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్‌గా పేర్కొంటూ బెడ్లు ఏర్పాటు చేసి పేషెంట్లకు హైఎండ్ యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు ఇస్తున్నారని తనిఖీల్లో బయటపడిందన్నారు. వర్షాకాలంలో వ్యాధులు నిర్లక్ష్యం చేయొద్దని, ఈ సమయంలో నకిలీ డాక్టర్లను/ రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ (ఆర్ఎంపీ) సంప్రదించడం వల్ల అనారోగ్యం మరింత పెరగడంతో పాటు వీరి వద్ద ఇచ్చే స్టెరాయిడ్ ఇంజెక్షన్లు, అనవసర యాంటీబయాటిక్స్ వాడకంతో రోగుల ఆరోగ్య పరిస్థితి విషమిస్తుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి మీ పరిసరాల్లో ఆర్ఎంపీ/ నకిలీ వైద్యులు ఇంజెక్షన్లు వేస్తున్నా, మందులు రాస్తున్నా వెంటనే టీజీఎంసీ వాట్సాప్ నంబర్ 91543 82727కి సమాచారం ఇవ్వాలని నరేశ్ కోరారు. తనిఖీల్లో వరంగల్ యాంటీ క్వాకరీ కమిటీ చైర్మన్ అన్వర్ మియా, హెచ్ఆర్‌డీఏ వరంగల్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.వెంకటస్వామి, బృందం పాల్గొన్నారు.

ఓటమి రేపటి విజయానికి నాంది





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి.పోటీలకు హాజరైన వివిధ జిల్లాల అథ్లెట్లు

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- జేఎన్‌ఎస్‌లో అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: నేటి ఓటమి రేపటి విజయానికి నాంది అని, క్రీడాకారులు ఓటమికి భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, అత్యాధునిక వసతుల కల్పన కోసం సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి సొంత గడ్డకు పేరు ప్రఖ్యాతులను తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 581 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు ఆగస్టు 3, 4 తేదీల్లో జేఎన్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



ఖిలా వరంగల్‌లో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

ఖిలా వరంగల్: మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రంను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వరంగల్ ఎల్‌బీనగర్ మోమిన్‌పురా, ఖిలా వరంగల్ మధ్యకోటలో మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి పీరీలకు పూలు, దట్టీలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీపీ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు నడుమ పీరీల ఊరేగింపు నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ సమీపంలోని పీరీల బావిలో రాత్రి 12 గంటలకు నిమజ్జనం చేసి ఘనంగా నివాళులర్పించారు.

సమగ్రశిక్ష జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్‌గా మన్మోహన్



బండారు మన్మోహన్

విద్యారణ్యపురి: సమగ్రశిక్షలో (విద్యాశాఖ) హనుమకొండ జిలా క్వాలిటీ ఎడ్యుకేషన్, స్కూల్ వెలుపల ఉన్న పిల్లల విభాగాలకు కోఆర్డినేటర్‌గా డాక్టర్ బండారు మన్మోహన్‌ను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం డీఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మన్మోహన్ ఎడ్యుకేషన్‌లో గౌరవ డాక్టరేట్, జువాలజీలో డాక్టరేట్ పొందారు. 25 సంవత్సరాల ఉపాధ్యాయ అనుభవం కలిగిన ఆయన రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్‌గా పనిచేశారు.

దరఖాస్తుకు నేడు చివరి తేదీ

న్యూశాయంపేట : సీఎస్‌ఏటీ 2025–26 ఉచిత శిక్షణ కోసం సోమవారంతో దరఖాస్తు గడువు ముగుస్తుందని ఎస్సీ స్టడీ సర్కిల్ ఉమ్మడి జిల్లా సంచాలకుడు కె.జగన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కేటగిరీ అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్ష ఈనెల 13న సుబేదారి ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మనుమడి మృతి తట్టుకోలేక..

- మనోవేదనతో అమ్మమ్మ కన్నుమూత
- నేరడలో విషాదఛాయలు



బుచ్చమ్మ (ఫైల్)

కురవి: మనుమడి మృతి తట్టుకోలేక మనోవేదనతో అమ్మమ్మ చనిపోయింది. ఈ విషాదకర ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బుర్ర జగదాంబ కుమారుడు శ్రీకాంత్ విద్యుత్ శాఖలో అన్‌మ్యాన్ కార్మికుడిగా పనిచేస్తూ శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తండా బుచ్చమ్మ(85) ఐదు సంవత్సరాలుగా తన బిడ్డ జగదాంబ ఇంటి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో మనుమడు శ్రీకాంత్ మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించగా రెండు రోజుల నుంచి గుండలిసేలా రోదిస్తూ మనోవేదనతో ఆదివారం మృతిచెందింది. దీంతో బుచ్చమ్మ, శ్రీకాంత్ అంత్యక్రియలు ఒకే సారి నిర్వహించారు. ఇద్దరి మృతదేహాలను అంత్యక్రియల నిమిత్తం తీసుకెళ్తుండగా గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

బొగతలో పర్యాటకుల సందడి..



జలపాతం వద్ద పర్యాటకులు

వాజేడు: మండల పరిధి చీకుపల్లి సమీపంలోని బొగత జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భారీ సంఖ్యలో తరలి వచ్చి సేదదీరారు. ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. జలపాతం జలధారలను వీక్షించడంతో పాటు సెల్ ఫోన్లలో బంధించారు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకుంటూ ఎంజాయ్ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

ఓల్డ్ ఏజ్ హోమ్ కేర్ సర్వీస్

స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్ / హోమ్ కేర్ సర్వీస్ 24 గం॥ 12 గం॥ వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు॥లను పంపించగలము. సంప్ర॥ 8186926067, 8977263124. [WA-6725]

BUSINESS OFFER

అధిక ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా! మీ సొంత ఇంటర్నేషనల్ క్యాపిటల్ మార్కెట్ మీ ట్రేడింగ్ అకౌంట్లో సంపాదించండి. ప్రాఫిట్ షేరింగ్ ఫిక్స్‌డ్ రిటర్న్ సేఫ్ & సెక్యూర్. 6301859174. [SCA25005885]

ITR / Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [HA-480]

WANTED

అనుభవజ్ఞులైన మహిళా టెలికాలర్ మరియు టైపిస్ట్ కావాలి. జీతం: 10K నుండి 15K బస్టాండ్ రోడ్, హనుమాన్ ఆలయం దగ్గర, HNK. సెల్: 9182375084, 9966653521. [WA-7571]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

మహబూబాబాద్‌లోని హేమ హుండాయ్ షోరూంలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (2 వీలర్ కలిగి ఉండాలి) ఏదైన డిగ్రీ. పూర్తి వివరాలకు బయోడేటాతో 8th & 9th July 2025 నాడు ఉ.11 గం. నుండి సా॥ 4 వరకు సంప్ర॥ హేమ హుండాయ్, ఇల్లెందు బైపాస్ రోడ్డు, సోనాలిక ట్రాక్టర్ షోరూం ఎదురుగా, మహబూబాబాద్. Cell: 9154921941. Email Id: pruthvipandae@gmail.com [WA-40]

Hema Motors needs Sales Executive: Any Degree, Experienced or Freshers also (Two wheeler must). Workshop - Washing Guy, Quali: 10th. Walk in Interview with resume on 07th & 08th July 2025 between 11 am to 6 pm. Cont: Hema Motors Pvt Ltd, Hyderabad Road, Jangaon. Cell: 9154921941. Email Id: pruthvipandae@gmail.com [WA-41]

సుజాత కన్సల్టెన్సీ & MSME లో పనిచేయుటకు అనుభవం గల అమ్మాయిలు / అబ్బాయిలు కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. సెల్: 8121385555, 8374314933. [SCA25005855]

Wanted Special Educator. B.Ed, HI for a School - JACKSON MISSION SCHOOL. Contact: 8885800489, 7075102777. [SCA25005897]

1) Bolero Car Driver Cum Shop Keeper (Both Works) Sal: 10K-14K. Age: 30-45yrs, 2) Sales & Delivery Boys, 3) Helpers & Machine Operators (Q: 10th, Inter, ITI. 8K to 10K. Cont: Veghan Naturals, IP Rampur, Kazipet. Cell: 9919911016 [WA-6724]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. Ph: 9848571888, 9640400073. [SCA25005909]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్	:9705748198
నర్సంపేట	:9553955722
జనగామ	:9951602871
మహబూబాబాద్	:9010144453
పరకాల	:9010299096
జయశంకర్ భూపాలపల్లి	:9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.